Title Code:T/TG/2024/0625/0392/884

# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మనసేత్రం

Follow

పేజీలు 10

సోమవారం, అక్టోబరు 6, 2025

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## ఇండోనేసియా స్కూలు ప్రమాదం.. 40కి చేరిన మరణాలు



సిడోఆర్జో: ఇండోనేసియాలో స్కూలు భవనం కుప్పకూలిన ఘటనలో మరణాలు 40కి చేరాయి. జాడ తెలియకుండా పోయిన మరో 23 మంది విద్యార్థుల కోసం శిథిలాలను తొలగిస్తూ అన్వేషణ కొనసాగిస్తున్నామని అధికారులు తెలిపారు. తూర్పు జావాలోని సిడోఅర్జోలోని అల్ ఖోజినీ స్కూలు భవనం సెప్టెంబర్ 30వ తేదీన అకస్మాత్తుగా కుప్పకూలడం తెల్సిందే. ఈ ఘటనలో ఒకే ఒక్కరు విద్యార్థి మాత్రమే ఎటువంటి గాయాలు లేకుండా బయటపడ్డాడు.



# నాలుగు పేర్లతో ఏఐసీసీకి జూబ్లీహిల్స్ లిస్ట్

- ప్రతిపాదించిన ఇన్‌చార్జి మంత్రులు
- జాబితాను 3 పేర్లకు కుదించే అవకాశం
- ఉప ఎన్నిక ప్రచారంపై మీనాక్షి, మహేశ్‌గౌడ్ సమీక్ష

హైదరాబాద్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి నలుగురు నేతల పేర్లను ఇన్‌చార్జి మంత్రులు ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. స్థానిక నేతలు నవీన్ యాదవ్, సీఎన్ రెడ్డి, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, అంజన్‌కుమార్ యాదవ్‌ల పేర్లను వారు ప్రతిపాదించినట్లు సమాచారం. గెలిచే అవకాశం ఉన్న నేతల పేర్లను ప్రతిపాదించాల్సిందిగా ఉప ఎన్నికకు ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, వివేక్ వెంకటస్వామికి సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల సూచించిన విషయం తెలిసిందే. ఈ మేరకు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని నాలుగు పేర్లను ప్రతిపాదిస్తూ

2లో

# పుణ్యక్షేత్ర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

- ఏటా లక్షల మంది భక్తులు వస్తున్నారుద... తదనుగుణంగా వసతులు పెంచాలి
- ప్రధాన రహదారులతో అనుసంధానం
- 2 వేల హెక్టార్ల అటవీ భూమి కేటాయించాలని కేంద్రాన్ని అడుగుదాం
- ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దాలి: సీఎం



అమరావతి, తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆదివారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో శ్రీశైలం అభివృద్ధిపై సమీక్షించారు. దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఏటా లక్షల సంఖ్యలో శ్రీశైలం ఆలయానికి భక్తులు వస్తున్నందున మెరుగైన సదుపాయాలు ఎలా కల్పించాలి, మాస్టర్‌ప్లాన్, అటవీ శాఖ అంశాలపై సమావేశంలో చర్చించారు. ఆలయ అభివృద్ధికి 2 వేల హెక్టార్ల అటవీభూమి కేటాయించాల్సిందిగా కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించారు. ఈ నెల 16న ప్రధాని మోదీ శ్రీశైలానికి వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లపై అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా, పర్యావరణహితంగా అన్ని రకాలుగా

2లో

## అమెరికాలో గ్యాంగ్ వార్..

- నడివీధిలో కాల్పులు, ఇద్దరి మృతి!
- అమెరికాలోని అలబామాలో కాల్పుల కలకలం
- రెండు ప్రత్యర్థి వర్గాల మధ్య నడిరోడ్డుపై ఫైరింగ్
- ఘటనలో ఇద్దరు మృతి, మరో 12 మందికి గాయాలు
- క్షతగాత్రుల్లో ఏడుగురు 17 ఏళ్ల లోపు వారే
- నిందితుల కోసం పోలీసుల గాలింపు



## సుప్రీం సస్పెన్స్!

- బీసీ రిజర్వేషన్లపై తగ్గేది లేదు.. బలంగా వాదించండి
- సీనియర్ న్యాయవాదులతో సీఎం రేవంత్‌రెడ్డి
- అభిషేక్ సింఘ్వీ, సిద్ధార్థ్ దవేలతో ఫోన్‌లో మంతనాలు
- ఢిల్లీకి హుటాహుటిన భట్టివిక్రమార్క, పొన్నం, వాకిటి

2లో

## బిహార్ ఎన్నికలునవంబరు 22లోపే

- ఛఠ్ పూజలాగే ఉత్సాహంగా పాల్గొనాలి
- ఓటర్లకు సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ పిలుపు
- ఎన్నికల సన్నద్ధతపై పట్నాలో సమీక్ష

న్యూఢిల్లీ, అక్టోబరు 5: బిహార్ అసెంబ్లీ ఎన్నికలు.. శాసనసభ పదవీకాలం ముగిసే నవంబరు 22వ తేదీలోపే జరుగుతాయని ఎన్నికల ప్రధాన కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ స్పష్టంచేశారు. ఛఠ్ పూజ(ఈ నెల 25 నుంచి 28 వరకు) మాదిరిగానే




2లో

## తన రాజీనామా వార్తలపై దానం నాగేందర్ క్లారిటీ



- ఎమ్మెల్యే పదవికి రాజీనామా అంటూ వస్తున్న వార్తలపై దానం స్పందన
- సోషల్ మీడియా ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే
- అవి పూర్తిగా అవాస్తవాలని, గిట్టనివాళ్లు చేస్తున్న కుట్ర అని ఆరోపణ
- తాను ఎలాంటి రాజీనామా చేయడం లేదని స్పష్టం చేసిన నాగేందర్
- ఈ తప్పుడు వార్తలను ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి

తన పదవికి రాజీనామా చేస్తున్నానంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి దానం నాగేందర్ తీవ్రంగా స్పందించారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, అదంతా కేవలం దుష్ప్రచారం మాత్రమేనని ఆయన కొట్టిపారేశారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడి పూర్తి స్పష్టతనిచ్చారు.తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం లేదని, ఈ పుకార్లను ఎవరూ నమ్మవద్దని దానం నాగేందర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "నాపై గిట్టనివాళ్లే ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. నేను రాజీనామా చేస్తున్నాననే వార్త పూర్తిగా అవాస్తవం" అని ఆయన తేల్చిచెప్పారు. తనపై రాజకీయంగా కుట్ర జరుగుతోందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. పార్టీకి, ప్రజలకు తాను ఎప్పుడూ అంకితభావంతో పనిచేస్తానని, పదవులు వదులుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

## ఆటో డ్రైవర్లకు చంద్రబాబు చేసింది ఘరానా మోసం: షర్మిల



- ఆటో డ్రైవర్ల సేవలో పథకంపై చంద్రబాబు సర్కారు మోసం చేసిందన్న షర్మిల
- కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- 13 లక్షల మందికి హామీ ఇచ్చి, 2.90 లక్షల మందికే పరిమితం చేశారని ఆరోపణ
- గత వైసీపీ ప్రభుత్వానికి, ఇప్పటి టీడీపీకి ఈ విషయంలో తేడా లేదని వ్యాఖ్య
- డ్రైవర్లందరి ఖాతాల్లో రూ.15 వేలు జమ చేయాలని ప్రభుత్వానికి డిమాండ్
- ట్యాక్సీ, భారీ వాహన డ్రైవర్లకూ పథకాన్ని వర్తింపజేయాలని సూచన

## తన రాజీనామా వార్తలపై దానం నాగేందర్ క్లారిటీ


గతంలో కాంగ్రెస్‌లో కీలక నేతగా ఉన్న దానం నాగేందర్, ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి మంత్రిగా కూడా పనిచేశారు. ఇటీవలే తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన, ఖైరతాబాద్ నియోజకవర్గంలో బలమైన నేతగా కొనసాగుతున్నారు. ఇలాంటి తరుణంలో ఆయన రాజీనామాపై వస్తున్న వదంతులు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ కష్టకాలంలో తనకు మద్దతుగా నిలుస్తున్న ప్రజలకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ దుష్ప్రచారం వెనుక ఎవరున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు వెల్లడిస్తానని దానం నాగేందర్ సూచనప్రాయంగా తెలిపారు.

## ఆటో డ్రైవర్లకు చంద్రబాబు చేసింది ఘరానా మోసం: షర్మిల



ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు, ప్రస్తుత అమలుకు పొంతన లేదని, ఇది డ్రైవర్లను ఘోరంగా మోసం చేయడమేనని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలోని డ్రైవర్ సోదరులకు మసిపూసి మారేడుకాయ చేశారని మండిపడ్డారు. "చంద్రబాబుగారి హామీలు బారెడు.. వాటి అమలు మాత్రం మూరెడు. ఏ పథకం అమలు చేసినా సగం సగమే. అన్నింటా కోతలే. నేడు ఆటో డ్రైవర్ అన్నలకు చంద్రబాబు గారు చేసింది ఘరానా మోసం. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలకు, ఎన్నికల్లో ఊదర గొట్టిన ప్రసంగాలకు, అమలు చేసిన ఆటో డ్రైవర్ల సేవలో 15 వేల పథకానికి పొంతనే లేదు. ఖాకీ చొక్కాలు వేసుకుని, ఆటోల్లో తిరిగినట్లు ఫొటోలకు పోజులిచ్చి, వారి కుటుంబాలను ఉద్ధరించినట్లు కాకమ్మ కబుర్లు చెప్పి, డ్రైవర్ అన్నలకు మసి పూసి మారేడుకాయ చేశారు. ఆటో డ్రైవర్లను మోసగించడంలో గత వైసీపీ ప్రభుత్వానికి, నేడు కూటమి ప్రభుత్వానికి తేడా లేదు. ఇద్దరూ దొందు దొందే. రాష్ట్రంలో బ్యాడ్జి కలిగిన ప్రతి డ్రైవర్ కి ఏటా 15 వేలు ఇస్తాం అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఓనర్ కం డ్రైవర్ కింద 2.60 లక్షల మందికి మాత్రమే వాహన మిత్ర ఇచ్చిందని నాడు మీరు ఎద్దేవా చేశారు. 13 లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉంటే 10 శాతం మందికి కూడా పథకం దక్కలేదని మండిపడ్డారు. అర్హతలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరిని ఆదుకుంటామని హామీలు ఇచ్చారు. అన్ని మాటలు చెప్పి 15 వేల పథకాన్ని కేవలం 2.90 లక్షల మందికే ఎలా ఇచ్చారు చంద్రబాబు గారూ? రాష్ట్రంలో బ్యాడ్జి కలిగిన డ్రైవర్ల సంఖ్య %=రూ% లెక్కల ప్రకారం సుమారు 15 లక్షలు. పోనీ మీ లెక్క ప్రకారం 13 లక్షల మంది బ్యాడ్జి కలిగిన వారికి కాకుండా మీరు కూడా 10 శాతం మందికే ఎలా ఇచ్చారు? మీరు సైతం ఓనర్ కం డ్రైవర్ విధానాన్ని ఎందుకు ఎంచుకున్నారు ? ఆటో తోలుకొని బ్రతికే వారిని ఎలా విస్మరించారు? పథకంలో కోత పెట్టేందుకు 18 నిబంధనలు ఎందుకు పెట్టారు? గత ప్రభుత్వం ఇచ్చిన దాంట్లో 30 వేల మందికి అదనంగా ఇచ్చిన మీరు 13 లక్షల ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఉద్ధరించినట్లా?ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు గారిని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 13 లక్షల మంది డ్రైవర్లకు పథకాన్ని వర్తింపజేయండి. అందరికి 15 వేల చొప్పున అకౌంట్లలో వేయండి. ట్యాక్సీ డ్రైవర్లకు, హెవీ వెహికల్ లైసెన్స్ కలిగిన ప్రతి ఒక్క డ్రైవర్ కి కూడా 15 వేలు ఇవ్వండి. అన్ని వర్గాల డ్రైవర్లతో కూడిన సాధికార సంస్థను ఏర్పాటు చేయండి" అని షర్మిల తన ప్రకటనలో పేర్కొన్నారు.

## పుణ్యక్షేత్ర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు



ఈ పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని చెప్పారు. అందుకోసం ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ప్రధానంగా శ్రీశైలానికి జాతీయ రహదారులను అనుసంధానం చేసేలా ఈ ప్రణాళికలు ఉండాలన్నారు. భక్తులు పెరుగుతున్నందున ఆలయ సమగ్రాభివృద్ధికి సత్వర చర్యలు అవసరమని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఇతర రాష్ట్రాల నుంచీ లక్షల సంఖ్యలో భక్తులు వస్తున్నందున సౌకర్యాలు విస్తరించాలన్నారు. శబరిమల, ఇతర ప్రముఖ దేవాలయాల్లో సౌకర్యాలు పరిశీలించి అభివృద్ధి చేద్దామని సూచించారు. శ్రీశైలాన్ని ఆదర్శప్రాయ యాత్రాస్థలంగా తీర్చిదిద్దేందుకు దేవదాయ, అటవీ, పర్యాటక శాఖల నడుమ సమన్వయం అవసరమన్నారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపైనా అధికారులకు తగు సూచనలు చేశారు. ఆలయంలో మల్లికార్జునస్వామి దర్శనానికి భక్తులు వెళ్లేందుకు, బయటకు రావడానికి ఇప్పుడు ఒకే మార్గం ఉంది. బయటకు వచ్చేందుకు వేరే మార్గం ఏర్పాటుపైనా సమీక్షలో చర్చించారు.

## భారత నేవీలోకి కొత్త యుద్ధ నౌక

భారత నౌకాదళం స్వదేశీకరణ ప్రయత్నాల్లో మరో మైలురాయిని అధిగమించింది. విశాఖ నేవల్ డాక్‌యార్డ్‌లో సోమవారం భారత నౌకాదళానికి చెందిన రెండో యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ నౌక 'ఆంద్రోత్'ను వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధర్కర్ జాతికి అంకితం చేశారు. సముద్రంలో శత్రు జలాంతర్గాముల భద్రతాపరమైన కార్యకలాపాలను అడ్డుకునే లక్ష్యంతో ఈ నూతన నౌకను రూపొందించారు. ఆంద్రోత్ అనే పేరును లక్షద్వీప్ ద్వీప సమూహంలోని ఒక ద్వీపం నుంచి ఎంపిక చేశారు. ఈ నౌకను కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ లిమిటెడ్ సంస్థ పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించింది. ఇటీవలి కాలంలో భారత నౌకాదళంలో అత్యాధునిక యుద్ధ నౌకలైన అర్నాలా, నిస్తార్, ఉదయగిరి, నీలగిరి ప్రవేశించగా, తాజాగా ఆంద్రోత్ కూడా చేరడంతో సముద్ర భద్రతలో భారత నౌకాదళం మరింత బలోపేతం అవుతోంది. ఈ సందర్భంగా వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధర్కర్ మాట్లాడుతూ, "స్వదేశీకరణ దిశగా ఇది భారత నౌకాదళానికి ఒక కీలక ముందడుగు. దేశీయ నౌకా నిర్మాణ సామర్థ్యాన్ని ఇది ప్రతిబింబిస్తుంది," అని అన్నారు

## సుప్రీం సస్పెన్స్!



న్యూఢిల్లీ:తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం సుప్రీంకోర్టుకు చేరింది. బీసీలకు రిజర్వేషన్లు పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబరులో తీసుకొచ్చిన జీవో 9ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం సోమవారం విచారించనుంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మనుసింఘ్వీ, సిద్ధార్థ్ దవేతో ఫోన్‌లో ప్రత్యేకంగా మంతనాలు జరిపారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అమలు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హైకోర్టు గడువు, గవర్నర్, రాష్ట్రపతి వద్ద బిల్లుల పెండింగ్, రాష్ట్ర ప్రభుత్వాలకు జీవో 9ని తీసుకొచ్చే అధికారం తదితర అంశాలపై వారితో అరగంటకు పైగా చర్చించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, ఇందులో రాజీపడే ప్రసక్తేలేదని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ 42% బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలకు వెళ్తామని, ఆ దిశగా ముందుకెళ్లాలని సీనియర్ న్యాయవాదుల ఎదుట చెప్పినట్లు సమాచారం. ఈ మేరకు సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించాలని సూచించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఇందిరా సహానీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా సహా ఇతర కేసులగురించి చర్చించినట్లు సమాచారం. జీవో 9కి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టనున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ఆదివారం హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. వారి వెంట బీసీ సంక్షేమం, సంబంధిత శాఖల అధికారులు కూడా ఉన్నారు. జీవో 9కి అనుకూలంగా ప్రభుత్వం తరఫున వాదన లు వినిపిస్తున్న ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీతో వారు భేటీ కానున్నారు. కులగణన సర్వే మొదలుకుని జీవో 9 జారీకి దారి తీసిన పరిస్థితులు, ఇతర అంశాలను ఆయన కు వివరించనున్నారు. కాగా, మంత్రుల బృందం ఆదివారం రాత్రి సుప్రీంకోర్టులో తెలంగాణ స్టాండిం గ్ కౌన్సిల్ శ్రవణ్‌కుమార్‌తో సమావేశమై చర్చలు జరిపింది. కాగా, సుప్రీంలో పిటిషన్ దాఖలైన వెంట నే బీసీ సంక్షేమ శాఖ అధికారుల బృందం ఢిల్లీకి చేరుకుంది. బీసీ రిజర్వేషన్లు, అమలు, కొత్త జీవో తదితర అంశాలపై న్యాయవాదులతో చర్చించింది.

**సుప్రీంకోర్టు స్పందనపై నేతల్లో ఉత్కంఠ..**

జీవో 9ని కొట్టివేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందన ఎలా ఉంటుందోనన్న ఉత్కంఠ అధికార కాంగ్రెస్ నేతల్లో నెలకొంది. ఇప్పటికే జీవో 9ని వ్యతిరేకిస్తూ హైకోర్టులోనూ పిటిషన్ దాఖలు కాగా.. దానిపై ఈ నెల 8న విచారణ జరగనుంది. అయితే ఆ జీవోకు మద్దతుగా ప్రజాప్రతినిధులు, సంఘాలతో హైకోర్టులో అఫిడవిట్లు దాఖలు చేయించేందుకు పెద్ద ఎత్తున కసరత్తు జరుగుతోంది. ఈ ప్రయత్నాలు ఇలా కొనసాగుతుండగానే.. సుప్రీంకోర్టులోనూ జీవో 9కి వ్యతిరేకంగా పిటిషన్ దాఖలైంది. దీంతో ఈ కేసు ఇప్పటికే హైకోర్టులో విచారణలో ఉన్నందున.. అక్కడే తేల్చుకోవాలని సుప్రీంకోర్టు చెబుతుందా? లేక ఏదైనా సూచన చేస్తుందా? అన్న చర్చ జరుగుతోంది. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులకు వ్యతిరేకంగా ఇచ్చిన ఈ జీవో.. చట్ట విరుద్ధమంటూ పిటిషన్‌దారు పేర్కొన్న నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసే అవకాశం ఉంటుందన్న చర్చ నడుస్తోంది. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టులో ప్రభు త్వం తరఫున బలమైన వాదనలు వినిపించడంలో న్యాయవాదులకు సహకారం అందించేందుకు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అధికారులు ఢిల్లీకి వెళ్లారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.





## నాలుగు పేర్లతో ఏఐసీసీకి జూబ్లీహిల్స్ లిస్ట్

టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు వారు నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్ ఆదివారం ఢిల్లీకి వెళ్లడానికి ముందు ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో భేటీ అయ్యారు. సీఎం రేవంత్ సూచన మేరకు జరిగిన ఈ భేటీలో ఢిల్లీలో చేపట్టాల్సిన కార్యాచరణతోపాటు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ప్రతిపాదించిన నాలుగు పేర్ల పైనా ప్రాథమికంగా చర్చించారు. దీనిపై సోమవారం లేదా మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డితో భట్టివిక్రమార్క, మహేశ్‌గౌడ్, మీనాక్షి నటరాజన్, మంత్రి ఉత్తమ్ సమావేశమై చర్చించనున్నట్లు తెలిసింది. సర్వేలు, నివేదికల ఆధారంగా ఆశావహుల జాబితాను షార్ట్‌లిస్ట్ చేసి మూడు పేర్లతో అధిష్ఠానానికి ప్రతిపాదన పంపనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రచారం జరుగుతున్న తీరుపై మీనాక్షి నటరాజన్, మహేశ్‌గౌడ్ ఆదివారం ప్రజాభవన్‌లో సమీక్ష నిర్వహించారు. మంత్రి తుమ్మల, డివిజన్ల వారీ ఇన్‌చార్జులుగా ఉన్న వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. ఎన్నికల ప్రచారం వ్యక్తి కేంద్రీకృతంగా కాకుండా పార్టీ, సిద్ధాంతం కేంద్రీకృతంగా సాగాలని మహేశ్‌గౌడ్, మీనాక్షి సూచించారు. అభ్యర్థిని సర్వేల ఆధారంగా అధిష్ఠానం నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు.

## అమెరికాలో గ్యాంగ్ వార్..

అమెరికాలో మరోసారి తుపాకులు గర్జించాయి. అలబామా రాష్ట్ర రాజధాని మాంట్‌గోమరి నగరంలో రెండు ప్రత్యర్థి వర్గాలు నడిరోడ్డుపై ఒకరిపై ఒకరు కాల్పులకు తెగబడ్డాయి. జనసమర్థం అధికంగా ఉన్న ప్రాంతంలో జరిగిన ఈ దారుణ ఘటనలో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోగా, మరో 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల్లో ఏడుగురు 17 ఏళ్ల లోపు మైనర్లు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. స్థానిక కాలమానం ప్రకారం శనివారం రాత్రి 11:30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నగరంలోని పర్యాటక ప్రాంతంలో ఉన్న ఓ కూడలి వద్ద జనం గుమిగూడి ఉన్న సమయంలో రెండు వర్గాలు ఒక్కసారిగా కాల్పులు ప్రారంభించాయి. ఇది ఒక భారీ కాల్పుల ఘటన అని మాంట్‌గోమరి పోలీస్ చీఫ్ జేమ్స్ గ్రాబోయ్స్ మీడియాకు వెల్లడించారు. "రెండు వర్గాలు చుట్టూ ఉన్న జనాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా ఒకరిపై ఒకరు కాల్పులు జరుపుకున్నాయి" అని ఆయన తెలిపారు.

గాయపడిన 12 మందిలో ముగ్గురి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని అధికారులు తెలిపారు. మృతుల్లో ఒకరు మహిళ అని పోలీసులు గుర్తించారు. క్షతగాత్రుల్లో అత్యంత చిన్న వయసున్న వ్యక్తి వయసు 16 సంవత్సరాలు. స్థానికంగా రెండు కాలేజీల మధ్య ఫుట్‌బాల్ మ్యాచ్ ముగిసిన కొద్దిసేపటికే ఈ ఘటన జరగడంతో ఆ ప్రాంతం రద్దీగా ఉంది. ఈ ఘటనపై నగర మేయర్ స్టీవెన్ రీడ్ తీవ్రంగా స్పందించారు. "ఈ అన్యాయానికి పాల్పడిన ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టేందుకు మా వద్ద ఉన్న అన్ని వనరులను ఉపయోగిస్తాం" అని ఆయన హామీ ఇచ్చారు. ప్రస్తుతం పోలీసులు ఘటనా స్థలంలో సాక్ష్యాధారాలను సేకరిస్తున్నారని, అనుమానితులను విచారిస్తున్నారని పోలీస్ చీఫ్ తెలిపారు. అయితే, ఈ ఘటనకు సంబంధించి ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదని, దర్యాప్తు వేగంగా కొనసాగుతోందని స్పష్టం చేశారు.



## బిహార్ ఎన్నికలునవంబరు 22లోపే

న్యూఢిల్లీ, అక్టోబరు 5: బిహార్ అసెంబ్లీ ఎన్నికలు.. శాసనసభ పదవీకాలం ముగిసే నవంబరు 22వ తేదీలోపే జరుగుతాయని ఎన్నికల ప్రధాన కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ స్పష్టంచేశారు. ఛఠ్ పూజ(ఈ నెల 25 నుంచి 28 వరకు) మాదిరిగానే ఓటింగ్‌లోనూ ఆనందోత్సాహాలతో పాల్గొనాలని రాష్ట్ర ఓటర్లకు పిలుపిచ్చారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేశామన్నారు. ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్)ను చట్టబద్ధంగానే చేపట్టామని చెప్పారు. త్వరలోనే దీనిని దేశవ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. రెండ్రోజుల రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆదివారం రెండో రోజు ఆదివారం ఆయన పట్నాలో సహచర ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషీలతో కలిసి అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల అధికారులతో సమీక్ష జరిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బూత్ స్థాయి అధికారు(బీఎల్‌వో)లు కూడా దీనికి హాజరయ్యారు. బిహార్ ఎన్నికలతో మొదలలయ్యే పలు సంస్కరణలను సీఈసీ విశదీకరించారు. ఇక నుంచి ఈ రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా పోలింగ్ కేంద్రానికి 1,200 మంది మాత్రమే ఓటర్లు ఉంటారని చెప్పారు. 'బిహార్లోని వైశాలి ప్రపంచానికే ప్రజాస్వామ్య మార్గాన్ని ఎలా చూపిందో.. అదే విధంగా ఓటర్ల జాబితాల ప్రక్షాళనలో వీరు దేశానికే స్ఫూర్తిగా నిలిచారు' అని కొనియాడారు. ప్రతి ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాల సవరణ ప్రజాప్రాతినిధ్య చట్టప్రకారం చట్టబద్ధమేనని.. ఎన్నికలు ముగిశాక సవరించడం కుదరదని గుర్తుచేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. సెప్టెంబరు 30న ఓటర్ల జాబితాను ప్రచురించామని.. చేర్పులు, తొలగింపులపై అభ్యంతరాలున్నా.. అర్హులైనవారిని చేర్చకపోయినా.. అభ్యంతరాలు తెలియజేసేందుకు ఇప్పటికీ పది రోజుల వ్యవధి ఉందని చెప్పారు. అన్ని అభ్యంతరాలను ఓటర్ నమోదు అధికారు(ఈఆర్‌వో)ల స్థాయిలో పరిష్కరిస్తామన్నారు. నామినేషన్లు మొదలు కాగానే ఓటర్ల జాబితా నిశ్చలంగా ఉంటుందని.. ఎన్నికల ప్రక్రియ ముగిసేదాకా అందులో మార్పులకు ఆస్కారం ఉండదన్నారు. ఎన్నికల ప్రక్రియలో నిష్పాక్షికత, పారదర్శకత కోసం 17 సంస్కరణలను బిహార్ ఎన్నికల నుంచే ఎన్నికల కమిషన్ శ్రీకారం చుడుతోందని జ్ఞానేశ్‌కుమార్ తెలిపారు. వీటిలో పోలింగ్ సందర్భంగా కొన్ని, ఓట్ల లెక్కింపు సమయంలో కొన్ని అమలవుతాయన్నారు. ఇకపై ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1,200 మందికి మించి ఓటర్లు ఉండరని స్పష్టంచేశారు. ప్రస్తుతం 1,500 మంది ఓటర్లు ఉంటున్నారు. తాజా సవరణతో బిహార్లో ఇప్పుడున్న 77,895 పోలింగ్ కేంద్రాలు 90,712కి పెరుగుతాయి.

బీఎల్‌వోలు గుర్తింపు కార్డులు ధరించడం తప్పనిసరి. ప్రతి పోలింగ్ కేంద్రంలో పూర్తిస్థాయిలో వెబ్‌కాస్టింగ్ నిర్వహిస్తారు. పోలింగ్ కేంద్రాల వెలుపల ఓటర్లు తమ మొబైల్ ఫోన్లను డ పాజిట్ చేసేందుకు ఒక కేంద్రం ఏర్పాటుచేస్తారు. ఎన్నికల గుర్తు ఉన్నప్పటికీ.. ప్రస్తుతం ఈవీఎంలోని బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థి ఫొటో బ్లాక్ అండ్ వైట్‌లో ఉంటోంది. వారిని గుర్తించడం కష్టంగా ఉంది. ఈ నేపథ్యంలో అభ్యర్థుల ఫొటోలు ఇక కలర్‌లో ఉంటాయి. బిహార్‌తో మొదలుపెట్టి ఇక దేశవ్యాప్తంగా ఇదే అమలవుతుంది. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎంత మంది ఉంటారో ప్రిసైడింగ్ అధికారి ఇచ్చే ఫాం-17సీకి, ఈవీఎం కౌంటింగ్ యూనిట్‌లో పోలైన ఓట్లల సరిపోలనప్పుడు వీవీప్యాట్లన్నిటినీ పూర్తిగా లెక్కిస్తారు. ఇక మీదట ఓట్ల లెక్కింపులో తుది రెండు రౌండ్ల ముందు మాత్రమే పోస్టల్ బ్యాలెట్ ఓట్లను రీకౌంట్ చేస్తారు. గుర్తింపు ధ్రువపత్రాల్లో ఆధార్‌ను చేర్చడంపై జ్ఞానేశ్‌కుమార్ స్పష్టత ఇచ్చారు. అది గుర్తింపు కార్డు మాత్రమేనన్నారు.

# మున్నూరు కాపు మహాసభ రాష్ట్ర కార్యాలయములో
# దసరా అలాయ్ బలాయ్



హైదరాబాద్, అక్టోబర్ 5(వాయిస్ టుడే): నగరంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కాచిగూడ మహాసభ కార్యాలయము లో దసరా ములాఖాత్ (అలయ్ బలై) కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు మహాసభ,మహిళా కమిటీ,యువక మండలి సభ్యులు పాల్గొని మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ రావు కి దసరా శుభాకాంక్షలు తెలియచేసారు. సంగం సభ్యులు పరస్పరం ఆలింగనం చేసుకొని పండగ శుభాకాంక్షలు తెలుకున్నారు.ఈ సందర్భంగా ఈసీ మెంబర్లు గుండం రమేష్,మరియు అశోక్ అందరి సభ్యులకు కండువా తో సత్కరించడం జరిగినది,ఈ సందర్భంగా మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ పార్టీ లకు అతీతంగా ఎలాంటి స్వార్థం లేకుండా కులం కోసం పనిచేయాలని కోరడం జరిగినది.ఈ కార్యక్రమములో ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ మించు నర్సింగ్ రావు,అశోక్ కుమార్, లోగిశెట్టి పద్మనాభం,చేపూరి వెంకటేశ్వర్ రావు, చెలిమిల్లి మహేష్ కుమార్, దయానంద్, ఆకుల రాకేష్,గండు సతీష్,దువ్వ చంద్రకాంత్,గుండం రమేష్,తోట శంకర్,దామోదర్,కాల నర్సింగ్ రావు,ఎంగుల హరీష్,బండారి శ్రీధర్,శ్యాం కుమార్,కటకం మహేష్, పత్తి అనిల్,సీనియర్ సిటిజన్ కమిటీ కన్వీనర్ సకుర్ ఉదయ్ చందర్,పుస్తమెట్టల కమిటీ కన్వీనర్ దండు నరేందర్, అల్లాడి సాయి ప్రసాద్,సప్పిడి వెంకటేష్, సప్పిడి భాస్కర్,అనిల్,కావేటి అజయ్ కుమార్,అడ్వకేట్ అన్నపూర్ణ,బండారి జ్యోతి,మహిళా కమిటీ అధ్యక్షులు చామకూర సుజాత,యువక మండలి అధ్యక్షులు ప్రతాప్ వినీత్,ప్రధాన కార్యదర్శి దండు ఆనంద్,కోశాది కారి మరిపల్లి అన్వేష్,యువకమండలి పదాది కారులు,సభ్యులు ఇతర కులసోధరులు పాల్గొన్నారు.



## మాజీ కేంద్ర మంత్రి, పార్లమెంట్ సభ్యులు గడ్డం వెంకట స్వామి 96వ జయంతి గణం

**– యాదాద్రి భువనగిరి జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి**

యాదాద్రి భువనగిరి జిల్లా (వాయిస్ టుడే ప్రతినిధి):– మాజీ కేంద్ర మంత్రి, పార్లమెంట్ సభ్యులు గడ్డం వెంకట స్వామి 96 వ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జయంతి కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి వెంకటస్వామి పాల్గొని మాజీ కేంద్రమంత్రి వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో,జిల్లా పంచాయితీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, అధికారులు , ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



## గ్యార్వి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్చెరు: తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్తంగి గ్రామ పరిధిలో గల మహమ్మద్ సుభాని దర్గాలలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన గ్యార్వి ఉత్సవాలలో పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి.. చదర్ సమర్పించారు. అన్ని మతాల సారాంశం ఒక్కటేనని.. ప్రతి ఒక్కరూ పరమత సహనాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఉపేందర్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, మేరాజ్ ఖాన్, రామకృష్ణ, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విజయదశమి ఉత్సవం

**ముఖ్య అతిథిగా ఎం. శ్రీధర్ రెడ్డి**



కూకట్ పల్లి, అక్టోబర్ 5(వాయిస్ టుడే) కూకట్‌పల్లిలోని ప్రశాంత్ నగర్ లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విజయదశమి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా ఎం. శ్రీధర్ రెడ్డి అందరికి విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వక్తగా నన్నపనేని రాజేశేఖర్ విజయదశమి పండుగ అధర్మంపై ధర్మం విజయం సంపాదించిన రోజు అని తెలిపారు. ఈ మేరకు 1925 లో ప్రారంభమైన ఆర్.ఎస్.ఎస్ అనేక అవరోధాలు ఎదుర్కొని ఎన్నో విజయాలను సాధించి 2025 లో శతజయంతి ఉత్సవాలను జరుపుకుంటుంది . వ్యక్తి నిర్మాణమే సమాజ శ్రేయస్సుకి కారణమవుతుందని వారు తెలియజేశారు. ఆర్.ఎస్.ఎస్ ని స్థాపించిన డాక్టర్ జి హిందూ ఐక్యత వలన మాత్రమే మన భారతదేశం విశ్వ గురువుగా నిలబడుతుందని వారు తెలిపారు. శతజయంతి సందర్భంగా పంచ పరివర్తన పేరుతో పౌర విధులు, కుటుంబ ప్రభోధన్, సామాజిక సమరసత, పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ స్వలంభణ, అనే అంశాలను పాటించాలని తద్వారా సమాజంలో మార్పు జరుగుతుందని మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అనేకమంది స్వయం సేవకులు గణవేష్ తో ప్రశాంత్ నగర్ పురవీధుల్లో పద సంచలనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మననియా చింతపట్ల కొండలరావు, ఇతర స్వయంసేవక బంధువులు పాల్గొన్నారు

## ట్రేడింగ్ మోసాలపై తస్మాత్ జాగ్రత్త

**నగర పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనార్**



రెడ్‌హిల్స్: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని నగర సీపీ సజ్జనార్ ఆదివారం ప్రకటనలో సూచించారు. మోసగాళ్లు నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్లు, యాప్‌లు, డ్యాష్‌బోర్డులు తయారు చేసి, తప్పుడు లాభాలు చూపిస్తూ ప్రజల నమ్మకాన్ని గెలుచుకుంటున్నారు. 'ట్యాక్స్ పేమెంట్', 'కంప్లయెన్స్ వెరిఫికేషన్', 'కన్వర్షన్ ఛార్జీలు' వంటి రకరకాల కారణాలతో డబ్బులు డిమాండ్ చేసి, చివరకు కనిపించకుండా పోతున్నారు. పైగా న్యాయపరమైన బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆయన హెచ్చరించారు.

ఫేస్‌బుక్, వాట్సప్, టెలిగ్రామ్‌లో 'ఎక్స్‌క్లూజివ్ ట్రేడింగ్ టిప్స్' లేదా ఇన్వెస్ట్‌మెంట్ ఆఫర్లతో పరిచయం అయ్యే వ్యక్తులను నమ్మవద్దు.

తెలియని వ్యక్తులు పంపిన అనధికారిక ట్రేడింగ్ యాప్‌లు, వెబ్‌సైట్లను ఇన్‌స్టాల్ చేయొద్దు.

'ట్యాక్స్, కంప్లయెన్స్, విత్‌డ్రాయల్ ఫీజు'ల పేరిట ఎవరైన డబ్బులు అడిగితే చెల్లించొద్దు.

సెబీ ద్వారా మాత్రమే ట్రేడింగ్ వేదికలను ధ్రువీకరించుకోండి.

మోసం బారిన పడితే వెంటనే 1930కి ఫోన్ చేయండి.

ప్రఖ్యాత కంపెనీల పేరుతో ఫోన్ కాల్స్, సందేశాలు వస్తే నమ్మొద్దు.

తెలియని వ్యక్తుల ఇన్వెస్ట్‌మెంట్ ఆఫర్లను తిరస్కరించండి.

లీగల్ యాక్షన్, మనీలాండరింగ్ ఛార్జ్ బెదిరింపులను పట్టించుకోకండి.



## కొల్లూరు మయూరి రాజు గౌడ్ ఘనంగా అమ్మవారి ఊరేగింపు

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : కొల్లూరులో దేవి నవరాత్రులు సందర్భంగా విశేష అలంకరణతో దర్శనమిచ్చే నేడు చివరి రోజు వివిధ సంస్కృతి సాంప్రదాయపదంగా అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో దసరా నవరాత్రి ఉత్సవాలు కొల్లూరు గ్రామంలో మయూరి రాజు గౌడ్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. పదిరోజులు పాటు కొనసాగిన ఈ ఉత్సవాల్లో అమ్మవారిని ప్రతిష్టించి, ప్రతిరోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు, నిత్య అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో చివరి రోజున, అమ్మవారి ఊరేగింపులో అమ్మవారి చీరలు వేలం పాటతో చీరలను దక్కించుకున్న గ్రామస్తులు కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని గ్రామ వీధుల ఊరేగించి, అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ సందర్భంగా రాజుగౌడ్ మాట్లాడుతూ, అమ్మవారి కరుణా కటాక్షాలు గ్రామ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, అందరిపై అమ్మవారి ఆశీస్సులు లభించాలని కోరుకుంటూ ఈ పదిరోజుల ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ వేడుకల్లో గ్రామంలోని పెద్దలు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. దసరా నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మయూరి రాజు గౌడ్ మరియు కొల్లూరు వార్డు ప్రజలు పెద్దలు మహిళలు భక్తులు దీక్ష స్వాములు తదితరులు పాల్గొన్నారు



## గడ్డం వెంకటస్వామి సేవలు చిరస్మరణీయం

**– భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్**

యాదాద్రి భువనగిరి జిల్లా (వాయిస్ టుడే ప్రతినిధి):– మాజీ కేంద్రమంత్రి తెలంగాణ రాష్ట్ర తొలి దశ,మలిదశ ఉద్యమ నేత గడ్డం వెంకటస్వామి కాక సేవలు చిరస్మరణీయమని భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ అన్నారు. ఆదివారంరోజు గడ్డం వెంకటస్వామి కాకా జన్మదిన సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దర్గాయి హరిప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తా వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని వెంకట స్వామి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ నిరుపేద దళిత కుటుంబంలో జన్మించి అంచలంచెలుగా ఎదిగి కేంద్ర మంత్రిగా ఏఐసీసీ కీలక నేతగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన నేత వెంకటస్వామి అని, సి డబ్ల్యూ సి సభ్యునిగా పార్టీలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం తీర్మానం చేయించి రాష్ట్ర ఏర్పాటుకు కీలక పాత్ర పోషించిన నేత వెంకటస్వామి అని, ముఖ్యంగా పేద దళిత కార్మిక రంగంలోని ప్రజలకు ఎనలేని సేవలు చేసిన గడ్డం వెంకటస్వామి వారి గుండెల్లో ఎప్పటికీ ఉంటారని వెంకట స్వామి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, సేవాదళ్ రాష్ట్ర నాయకులు పిట్టల బాలరాజ్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నాగారం శంకర్, చుక్క స్వామి, కొండపురం గణేష్, దేవరకొండ మహేష్, ఎండి షరీఫ్, నాయిని ప్రవీణ్ కుమార్, సాల్వేర్ ఉపేందర్, గ్యాస్ చిన్న ,డాకురి ప్రకాష్, శంకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



## వీర శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గామాత శోభాయాత్ర ఘనం

యాదాద్రి భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):– భువనగిరిలో వీర శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గామాత శోభాయాత్ర ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కసుభ శ్రీనివాసరావు, కొత్తగూడెం భద్రాచలం జిల్లా కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్ పోత్నక్ ప్రమోద్ కుమార్, ఈరపాక నరసింహ విచ్చేశారు.ఈ కార్యక్రమంలో వీర శివాజీ యూత్ ప్రెసిడెంట్ సురగొని రాజు,రఘు సురేష్ ,సన్నీ ,రంజిత్, మసూద్ ,బన్నీ, యూత్ సభ్యులు పాల్గొనడం జరిగింది.

## ఓయూ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా అక్బర్ బైగ్ భారీ విజయం



నాచారం (వాయిస్ టుడే): ఉస్మానియా యూనివర్సిటీలో ఇటీవల జరిగిన ఉద్యోగ సంఘాల ఎన్నికల్లో టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా అక్బర్ బైగ్ భారీ మెజార్టీతో గెలుపొందారు. గతంలో జరిగిన ఎన్నికలోల ఈయన ఐదు పర్యాయాలు సెక్రటరీగా, ఉపాధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా వివిధ హోదాల్లో విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల పక్షాన ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఇంత కాలం తాను ప్రశ్నించే తత్వంతో । ఉద్యోగుల సంక్షేమానికి పాటుడుతున్నానీ అందుకే తనను వరుసగా గెలిపించారనీ పేర్కొన్నారు. తనకు భారీ విజయం సాధించిపెట్టిన టెక్నికల్ స్టాఫ్ ఉద్యోగులందరికి కృతజ్ఞతలు తెలియజేశారు.౦

## అంబర్పేట్ బిడ్డ కు అమెరికాకు చెందిన యూనివర్సిటీ నుండి ఆగ్రాలో డాక్టరేట్ బిరుదు



హైదరాబాద్, అక్టోబర్ 05 ( వాయిస్ టూ డే): అంబర్పేట్ ,పటేల్ నగర్ కు చెందిన ప్రముఖ భరతనాట్య గురువు శ్రీమతి కూన ప్రియదర్శిని కి ఆగ్రా లోని రాడిసన్ హోటలో అమెరికాకు చెందిన జార్జియా డిజిటల్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ మరియు ప్రభుత్వ రంగ సంస్థ నీతి ఆయోగ్ ద్వార భరతనాట్య విభాగం లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుని సిని నటి మరియు విఖ్యాత భరతనాట్య కళాకారిణి సుధా చంద్రన్ చేతుల మీదుగా ప్రధానం చేయడం జరిగింది. ఈ పురస్కారాలు తీసుకున్నందుకు కారకులైన తన గురువులకు మరియు తల్లిదండ్రులకు డాక్టర్ కూన ప్రియదర్శిని కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాన్స్ మాస్టర్ సిరాజ్, రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.



## దొంగ ఓట్లతో దొడ్డి దారిన బీజేపీ అధికారంలోకి వస్తుంది

**సంతకాల సేకరణ ద్వారా ప్రతి డివిజన్ నుండి ప్రజల అభిప్రాయాలు సేకరిస్తాం**

**64వ డివిజన్ ఇందిరా చౌక్ నుండి సంతకాల సేకరణ ప్రారంభించాం**

**ఈ నెల 17 లోపల అన్ని డివిజన్లలో సంతకాల సేకరణ జరుగుతుంది**

**సుడా చైర్మన్,నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**

కరీంనగర్,అక్టోబర్ 05(వాయిస్ టుడే):దేశ వ్యాప్తంగా నమోదు చేసుకున్న దొంగ ఓట్లతో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఇప్పటికైనా కేంద్ర ఎన్నికల సంఘం కళ్లు తెరవాలని సుడా చైర్మన్,నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఇందిరా చౌక్ వద్ద కొత్త 64 వ డివిజన్ నుండి సంతకాల సేకరణ ప్రారంభించారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా స్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఓటు చోరీని అరికట్టడంలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.ఈ నెల 17 తేదీ లోపూ అన్ని డివిజన్లలో డివిజన్ల అధ్యక్షులు ఇంచార్జులు సంతకాల సేకరణ చేయాలని ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో ముఖ్యనాయకులు పాల్గొంటారని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయ్యేంతవరకు ఇలాంటి కుట్రలను తిప్పి కొడుతామని ఓటు చాలా విలువైనదని బీజేపీ ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని నరేందర్ రెడ్డి అన్నారు.డివిజన్ బాద్యుడు పెద్దిగారి తిరుపతి ఆధ్వర్యంలో 64 డివిజన్ కు చెందిన పి.పద్మ,కోమలత, మనీషా, ఆరిఫ్, వెన్నెల,సోహెల్ శివాని పత్రాలపై సంతకాలు చేశారు.ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి రహ్మత్ హుస్సేన్,కొరివి అరుణ్ కుమార్, బోనాల శ్రీనివాస్,అబ్దుల్ రహేమాన్, అహ్మద్ అలీ,గుండాటి శ్రీనివాస్ రెడ్డి,ఎండి చాంద్,దండి రవీందర్,కుర్ర పోచయ్య,నెల్లి నరేష్, యనమల మంజుల,షబానా మహమ్మద్, ముల్కల కవిత,ఊరడి లత,హసీన, జ్యోతి రెడ్డి,వంగల విద్యా సాగర్, సలీం,సుదర్శన్,నాగుల సతీష్, మాదాసు శ్రీనివాస్,బత్తిని చంద్రయ్య, మహమ్మద్ భారీ,షెహెన్న పాల్గొన్నారు.




## జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా దివంగత మాజీ కేంద్రమంత్రి వెంకటస్వామి (కాక) జయంతి

కరీంనగర్, అక్టోబర్ 05(వాయిస్ టుడే): మాజీ కేంద్రమంత్రి దివంగత గడ్డం వెంకటస్వామి జయంతి కార్యక్రమాలు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెంకటస్వామి చిత్రపటానికి టిపిసిసి ప్రధాన కార్యదర్శి రహమత్ హుస్సేన్, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి,టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్న రాజ మల్లయ్య,డిసిసి ఎస్సీ సెల్ అధ్యక్షులు కొరవి అరుణ్ కుమార్,డిసిసి బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి,కొరివి అరుణ్ కుమార్ మాట్లాడుతూ వెంకటస్వామి పేదల పక్షపాతి అని, హైదరాబాద్ నగరంలో నిరుపేదలకు గుడిసెలు వేయించి గుడిసెల వెంకటస్వామిగా పిలువబడ్డారని,కార్మిక శాఖ మంత్రిగా పనిచేసే కార్మికుల హక్కుల కోసం, పెన్షన్ సదుపాయాల కోసం పోరాడిన మహానీయుడని,ప్రతి పేదోడి గుండెలో కాక చిరస్థాయిగా నిలిచిపోతాడని, రాష్ట్ర,కేంద్ర మంత్రిగా,పిసిసి అధ్యక్షులుగా పలు పదవులు నిర్వహించి ప్రతినిత్యం పేదల కోసం పరితపించే వ్యక్తి వెంకటస్వామి,వారి ఆశయ సాధన కోసం పని చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు కాడే శంకర్ ,వంగల విద్యాసాగర్, నాగుల సతీష్,కుంభాల రాజ్ కుమార్,గంగుల దిలీప్,పర్వత మల్లేశం, మాదాసు శ్రీనివాస్,చాంద్ పాషా, సిరికొండ శివప్రసాద్,యనమల మంజుల,కాంపల్లి కీర్తి కుమార్, నర్సింగం,తోట రవి,మామిడి సత్యనారాయణ రెడ్డి,లక్ష్మణ్ ముదిరాజ్,సుంకరి గణపతి, వీర దేవేందర్ పాల్గొన్నారు.౦



## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి: కన్న కృష్ణ

కొత్తపల్లి,అక్టోబర్ 05(వాయిస్ టుడే): భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షులు కుంట తిరుపతి ఆధ్వర్యంలో మండల స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశం కమాన్పూర్ గ్రామంలోని గణేష్ కన్వెన్షన్ లో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జడ్పీటీసీ.ప్రభారీ కన్న కృష్ణ హాజరయ్యి మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులదే గెలుపని, ఏ ఎన్నికలు వచ్చిన బీజేపీ అభ్యర్థులదే హవా అని అన్నారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ అధిక ఎంపీటీసీ స్థానాలు గెలుచుకుని ఎంపిపి స్థానాన్ని కైవసం చేసుకుంటుందని తెలిపారు. అదేవిధంగా జడ్పిటీసీ స్థానాన్ని కూడా గెలుచుకుంటుందని తెలిపారు.టిక్కెట్లు ఎవరికి వచ్చిన కార్యకర్తలు అందరూ కూడా సమిష్టిగా పనిచేయాలని సూచించారు.పార్టీ విజయానికి కార్యకర్తలు వెనుకంజ వేయకుండా పనిచేయాలని అన్నారు. పార్టీకి వ్యతిరేక విధానాలకు పాల్పడితే వారిపై తగిన చర్యలుతీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కడార్ల రతన్,వేముల అనిల్, కోమటిరెడ్డి అంజన్ కుమార్,సోమినేని కర్ణాకర్,కడారి శ్రీనివాస్,పూర్తి అనిల్, నలువాల మహేష్,వివిధ గ్రామాల బూత్ కమిటీ అధ్యక్షులు,ఎంపీటీసీ, జడ్పీటీసీ ఆశావహులు,కార్యకర్తలు పాల్గొన్నారు

# రామకృష్ణ కాలనీలో ఘనంగా ఆర్ఎస్ఎస్ పథ సంచాలన్

**ఆర్ఎస్ఎస్ వందేళ్లుగా దేశ, సమాజసేవ ,జాతిని సంఘటితం చేసే కార్యం కోసం పనిచేస్తుంది.**

**ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ భానుచందర్ జి.**



తిమ్మాపూర్, అక్టోబర్ 05(వాయిస్ టుడే): డాక్టర్ కేశవరావు బలిరామ్ హెడ్గేవార్ ఆత్మ విశ్వాసంతో, దూరదృష్టితో ఆర్.ఎస్.ఎస్ అనే దారిదీపంతో మన జాతి ఆత్మను మేల్కొలిపి,జాతిని సంఘటిత (ఐక్యత) పరిచే శాశ్వత కార్యాన్ని ముందు ఉంచారని,1925 లో ప్రారంభించబడిన ఆర్.ఎస్.ఎస్ జాతి ఐక్యతే లక్ష్యంగా,సమాజ,దేశ సేవ కోసం 100 సంవత్సరాలుగా పనిచేస్తూ ముందు కొనసాగుతుందని ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ భానుచందర్ జి అన్నారు.ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా తిమ్మాపూర్ ఖండ ఆధ్వర్యంలో రామకృష్ణ కాలనీ ఏరియాలో పథ సంచాలన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్య వక్తక హాజరైన భానుచందర్ జి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఆర్.ఎస్.ఎస్.హిందూ సమాజ సంఘటన కార్యానికి శ్రీకారం చుట్టిందన్నారు.ప్రతి రోజు ఒక గంట “శాఖ”కార్యం ద్వారా సమాజహితం గురించి ఆలోచించే వ్యక్తులు దేశం నలుమూలలనుంచి తయారు కావాలని సంకల్పంతో ఆర్.ఎస్.ఎస్ ఇన్నేళ్లుగా పనిచేస్తుందన్నారు. దేశమంతట దేశహితం గురించే ఆలోచించే వ్యక్తులతో వ్యవస్థ నిర్మాణమైతే అదే ఈ దేశానికి శ్రీరామరక్ష అవుతుందని,అలాంటి పనే ఆర్ఎస్ఎస్ చేసిందన్నారు.ఆర్ఎస్ఎస్ ధృడమైన జాతీయ భావాల నిర్మాణం కారణంగా నేడు ఏళ్ల తరబడి ఉండిపోయిన కాశ్మీర్ సమస్య,రామ జన్మభూమి మందిర నిర్మాణ సమస్య,తీవ్రవాద సమస్యలు,దేశ వ్యతిరేఖ కార్యకలాపాలు ఇలా ఎన్నింటికో పరిష్కారం చూపబడిందన్నారు.దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి ప్రపంచంలో అగ్రగామి దేశంగా చూడటమే ఆర్.ఎస్.ఎస్.లక్ష్యన్నారు. దీనినే ప్రతిరోజు”పరమ్ వైభవన్ నేతు మేతత్ స్వరాష్ట్రమ్(సంస్కృతంలో రాష్ట్రము అంటే జాతి) అంటూ స్వయంసేవకులు శాఖల్లో జరిగే ప్రార్థన లో గుర్తు చేసుకుంటారని తెలిపారు. హిందూరాష్ట్ర పరమవైభవాన్ని సాధించటం సంఘలక్ష్యమన్నారు.ప్రతి మనిషి కూడు,గూడు,గుడ్డ,విద్య, ఆరోగ్యం,సంస్కారం కలిగి ఉండటం పరమ వైభవ స్థితి అని,ఈ క్రమంలో వ్యక్తిని వికసింపజేసే దిశలో సంఘం నిరంతరం ఆలోచిస్తుందన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇండియన్ ఆర్మీ మాజీ సైనికులు శ్రీధర్ జి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ను దేశభక్తుల ఆర్మీగా అభివర్ణించారు. దేశ రక్షణ కోసం సైనికులు పనిచేస్తుంటే, మాతృభూమి సేవ కోసం స్వచ్ఛందంగా ఆర్ఎస్ఎస్ పనిచేస్తుందన్నారు.ఆర్ఎస్ఎస్ ను స్థాపించిన డాక్టర్ జి దూరదృష్టి, ఆలోచన విధానాలతో నేడు అతిపెద్ద జాతీయవాదా సంస్థగా ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించిందన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ్ సద్భావన ప్రముఖ్,కొండేటి బాలరాజ్ జి, జిల్లా కార్యవహ్ గుత్తికొండ రాజశేఖర్ జి, జిల్లా శరీరక్ ప్రముఖ్ కాముటం వినీత్ జి,జిల్లా సేవా ప్రముక్ సంపత్ జి,తెలంగాణ ప్రాంత సామజిక సమరసత సహ్ కార్యకరిని పుల్లూరి రామారావు ,ఖండ కార్యవహ్ ఆవుల కుమార్ జి,ఎడ్ల భూమిరెడ్డి , నర్సింగరావు జి,ఖండ కార్యకరిని, ఉపమండల ప్రముఖ్ లు, చిగురుమామిడి,గన్నేరువరం, తిమ్మాపూర్ స్వయం సేవక్ పాల్గున్నారు.



## రేవంత్ రెడ్డిని విమర్శించే స్థాయి ఎర్రబెల్లికి లేదు

తొర్రూరు, అక్టోబర్ 5 వాయిస్ టుడే : తన మనవరాలి వయస్సు ఉన్న పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి చేతిలో చిత్తుచిత్తుగా ఓడిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకురాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించే నైతిక హక్కు లేదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్,బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పింగిలి ఉష విమర్శించారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు.దళితులకు సీఎం చేయలేదని,దళితులకు మూడెకరాల భూమి ఇవ్వలేదని, రేషన్ కార్డు ఇవ్వలేదని,రుణమాఫీ చేయలేదని,డబుల్ బెడ్ రూములు ఇవ్వలేదని కేజీ టు పీజీ వరకు విద్య అందించలేదని విమర్శించారు.మాజీ మంత్రి ఎర్రబెల్లి మంత్రిగా అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని,అభివృద్ధి పనుల్లో కమిషన్లు తీసుకొని అభివృద్ధి చేయకుండా వదిలేశాడని,గత ప్రభుత్వంలో మహిళలను పట్టించుకోలేదని విమర్శించారు.సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు స్థానిక ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించిందని, ఉచిత బస్సు ప్రయాణం, గృహ లక్ష్మీ పథకం ద్వారా 200 ఉచిత విద్యుత్, అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా పాఠశాలల నిర్వహణ, పెట్రోల్ బంకు నిర్వహణ,ఆర్టీసీలో 150 బస్సులను మహిళా సంఘాల ద్వారా నడుపుతూ ఒక్క బస్సుకు నెలకు రూ. 69 వేల ఆదాయం వస్తుందని, వడ్డీ లేని రుణాలు అందిస్తుందని అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి,టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డిలు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. 10 ఏళ్లలో చేయని అభివృద్ధి కేవలం రెండేళ్లలో రేవంత్ రెడ్డి చేశాడని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే కనీస నైతిక హక్కు ఎర్రబెల్లికి లేదన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గంజి విజయపాల్ రెడ్డి, మంగళపల్లి రామచంద్రయ్య, తాళ్లపల్లి బిక్షం గౌడ్,దొంగరి శంకర్, ముద్దసాని సురేష్,కిషన్ యాదవ్, వెలుగు మహేశ్వరి,బసనబోయిన మహేష్ యాదవ్,గండు అండమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 9న జాతీయ బృంద గీతల పోటీలు

వరంగల్ ( వాయిస్ టుడే ) అక్టోబర్ 05 : భారత్ వికాస్ పరిషత్ ఓరుగల్లు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9,వ తేది న వరంగల్ దేశాయిపేట రోడ్ లోని నాగార్జున ప్రైమ్ స్కూల్ లో జాతీయ బృంద గీతాల పోటీల ను నిర్వహిస్తున్నట్లు బివిపి అధ్యక్ష కార్యదర్శులు డా. సుదీర్ కుమార్, కే సత్యనారాయణ ఓ ప్రకటన లో తెలిపారు. ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదివే రెండు గ్రూపులుగా ఏర్పాడి ఒక గ్రూపు హిందీ సంస్కృతం పాటలు, ఒక గ్రూపు ప్రాంతీయబాషా గీతం జానపదగీతం పాడానున్నారు. ఒకే గ్రూపు రెండు విభాగాల గీతాలు పా డుకునే అవకాశం ఉందని, ఒక గ్రూపులో ఆరు నుండి విద్యార్థులు పాల్గొంటారన్నారు.పోటీలలో విద్యార్థులు ఎవరి వాయిద్యాలు వారే మూడు మించకుండా తెచ్చుకోవాలి. ఎలక్ట్రిక్ లేదా బ్యాటరీలతో ఉపయోగించే వాయిద్యాలు అనుమతించబడవని పేర్కొన్నారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులు ఇష్ట ప్రకారం సంప్రదాయ దు స్తులు దరించవచ్చు గాని, పాఠశాల పేరును తెలియజేసే దుస్తులు ధరించరాని వారన్నరు. విద్యార్థులు గురువారం ఉదయం 9 గంటలకు నాగార్జున ప్రైమ్ స్కూల్ కు హాజరై తమ పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా బీవీపీ బాధ్యులు సుదీర్ కుమార్ సత్యనారాయణ తెలిపారు. రెండు విభాగాల్లో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులు, ఈనెల 12 హైదరాబాదులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలు అర్హత సాధిస్తారన్నారు. సంబంధిత వివరాల కోసం కే సత్య నారాయణ కార్యదర్శి 986660374 నెంబర్ ను సంప్రదించాలని అన్నారు

# కరీంనగర్లో ఘనంగా ఆర్ఎస్ఎస్ పథ సంచాలన్

**నగరంలోని పలు ప్రాంతాల మీదుగా స్వయంసేవకుల భారీ కవాతు**

**పంచ పరివర్తన్ లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు**

**ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యవహ కాచం రమేష్ జి.**



కరీంనగర్,అక్టోబర్ 05(వాయిస్ టుడే):రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని కరీంనగర్లో పథ సంచాలన్ నిర్వహించింది. కరీంనగర్ లోని పలు ప్రాంతాల మీదుగా సాగిన రూట్ మార్చ్ లో భారీ ఎత్తున పాల్గొని టిటిడి కళ్యాణమండపం వరకు కవాతు నిర్వహించారు.అనంతరం టిటిడి కళ్యాణమండపంలో జరిగిన సమావేశానికి తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేష్ జి ముఖ్యఅతిథిగా హాజరై స్వయం సేవకులను ఉద్దేశించి మాట్లాడారు.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ భారతదేశాన్ని తమ మాతృభూమిగా భావించే ప్రజల ప్రయోజనాలను రక్షించడమే ఆశయంగా,సమాజ,దేశ సేవ లక్ష్యంగా డాక్టర్ కేశవ్ రావు బలి రామ్ పంత్ హెడ్గేవార్ (డాక్టర్ జి) ఆర్ఎస్ఎస్ సంస్థను మహారాష్ట్రలోని నాగపూర్ లో 1925 న విజయదశమి రోజున అతి చిన్న వయసు కలిగిన పదిమంది పిల్లలతో ప్రారంభించారని తెలిపారు.అలాంటి ఆర్ఎస్ఎస్ నేడు కోట్లాదిమంది స్వయం సేవకులను కలిగి,దేశ,సమాజ సేవలో అత్యంత ప్రభావిత సంస్థగా మారిందన్నారు.ఈ విజయదశమి కి ఆర్ఎస్ఎస్100 ఏళ్లు పూర్తి చేసుకుంటున్నా శుభ సందర్భంలో శతజయంతి ఉత్సవాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తుందని తెలిపారు.వందేళ్లు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న అతిపెద్ద జాతీయవాద సంస్థ గా ఆర్ఎస్ఎస్ చరిత్రలో నిలిచిపోయిందన్నారు.ఒకనాడు మహారాష్ట్రకే పరిమితమైన ఆర్ఎస్ఎస్ నేడు దేశంలోని అన్ని రాష్ట్రాలు,జిల్లాలు,మండలాలు, గ్రామాలకు విస్తరించిందనీ చెప్పారు. ముఖ్యంగా ఆర్ఎస్ఎస్కు సర్ సంఘ చాల కులుగా పనిచేసిన ఎంతోమంది పెద్దలు ఆర్ఎస్ఎస్ ను ఒక మహా వృక్షం మాదిరిగా యావత్ భారతదేశం అంతటా విస్తరించడానికి తమ జీవితాలను ధార పోశారని తెలిపారు. ఆర్ఎస్ఎస్ పుట్టిందే మాతృభూమి సేవ కోసమన్నారు. హైందవాన్ని ఒక మతంగా కాక ఒక జీవన విధానంగా, భారత ప్రజలను భరతమాత రూపంగా భావించి, భారత దేశాన్ని తమ మాతృభూమిగా భావించే ప్రజల కోసం,దేశ సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించడం కోసం, సమాజసేవ కోసం కోట్లాది స్వయం సేవకులు నిరంతరం పనిచేస్తు, నిస్వార్థ సేవ లక్ష్యంతో ముందుకు కొనసాగుతుందన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలు పంచ పరివర్తన్ లక్ష్యం దిశగా కొనసాగుతున్నాయన్నారు. ఇందులో ముఖ్యంగా ఐదు అంశాలను స్వయం సేవకులు ప్రతి ఇంటికి వెళ్లి తెలియజేసే విధంగా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యంగా ఆర్ఎస్ఎస్ ను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. ఆర్ఎస్ఎస్ ఒక పవర్ హౌస్ లాంటిదని, ఒక పవర్ హౌస్ నుండి కరెంటు దేశంలోని అన్ని అవసరాలకు ఎలా ఉపయోగపడుతుందో ఆర్ఎస్ఎస్ కూడా అదేవిధంగా దేశం కోసం ఉపయోగపడే పని చేస్తుందన్నారు. ముఖ్యంగా వ్యక్తి సరైన వాడైతే సమాజం కూడా సరైన దిశలో ప్రయాణిస్తుందని తెలిపారు.ప్రధానంగా సంఘం నిర్వహించే శాఖ పద్ధతి ద్వారా వ్యక్తి నిర్మాణాన్ని చేస్తుందనీ, గంటసేపు శాఖలో జరిగే వివిధ కార్యక్రమాలతో వ్యక్తి వికాసం కోసం కృషి చేస్తుందన్నారు.హిందూ సమాజాన్ని సంఘటితం చేయడం, దేశాన్ని ప్రపంచంలోనే గురువు స్థానంలో ఉంచాలనే సంకల్పంతో ఆర్ఎస్ఎస్ నిరంతరం పనిచేస్తుందని ఆయన తెలిపారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ



రాయికల్(వాయిస్ టుడే) రాయికల్ మండలంలో తాట్లవాయి గ్రామంలో ఘనంగా సద్దుల బతుకమ్మ ఘనంగా నిర్వహించారు గునుక తంగేడు బంతి, టేకు, అనేక పువ్వులతో అతిపెద్ద బతుకమ్మను పేర్చి గ్రామ పురవీధుల్లో బతుకమ్మ సాంప్రదాయ బద్ధమైన చప్పట్లు ఆటపాటలతో బతుకమ్మను నిమజ్జనం చేశారు

## అక్రమ ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వాయిస్ టుడే మహబూబ్నగర్ జిల్లా అక్టోబర్ 5 (జడ్చర్ల )నవాబు పేట్ : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఉదయం పోలీసులు పట్టుకున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా,చౌడాపూర్ మండలం,మెట్టుగడ్డ తాండకు చెందిన హర్యానాయక్(36)అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా చాకలిపల్లి గ్రామంలోని వాగు నుండి అక్రమంగా ఫిల్టర్ ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రం తెలిపారు.



## స్వర్గీయ గడ్డం వెంకటస్వామి జయంతి సందర్భంగా పండ్ల పంపిణీ

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా అక్టోబర్-05 వాయిస్ టుడే : సుల్తానాబాద్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని కేంద్ర మాజీమంత్రి, తెలంగాణ తొలి మలిదశ ఉద్యమకారుడు, అనగారిన వర్గాల ప్రతినిధి స్వర్గీయ గడ్డం వెంకటస్వామి కాకా తొంభై ఆరవ జయంతిని వేడుకలను పెద్దపెల్లి జిల్లా ఐఎన్టీయూసీ, వైస్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, నీరటి శంకర్ ఆధ్వర్యంలో, కేకు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ మాజీ చైర్మన్ గాజుల లక్ష్మి రాజమల్లు పాల్గొని, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బాలింతలకు బ్రెడ్ ప్యాకెట్స్ పండ్లు, పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ నీరటి శంకర్ మాట్లాడుతూ ఆ మహనీయుల స్ఫూర్తిని మనమంతా ఆదర్శంగా తీసుకోవాలన్నారు.మారుమూల ప్రాంతంలో జన్మించినప్పటికీ జీవితంలో గొప్ప స్థాయికి ఎదిగిన మహనీయులు వెంకటస్వామి కాక, కేంద్ర మంత్రిగా వివిధ పదవులు చేపట్టి మన ప్రాంతంలోని పేదలకు అనేక సేవలందించారని, ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయడంలో కీలకపాత్ర పోషించారన్నారు. ప్రజలకు ఎనలేని సేవలు చేసిన, అటువంటి మహనీయులు మన ప్రాంతంలో జన్మించడం మనందరికీ గర్వకారణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గాజుల లక్ష్మి రాజమల్లు, న్యాయవాదులు ఆరెపల్లి రాహుల్, కర్ణాకర్, సీనియర్ జర్నలిస్టులు సామల హరికృష్ణ, న్యాతరీ శ్రీనివాస్, చొప్పరి వెంకటేష్, చొప్పరి రాజు, కల్వల శ్రీనివాస్, కిరణ్, స్వామి, శ్రీనివాస్ సజ్జాద్ కాకా అభిమానులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## వృద్ధుడు అదృశ్యం.. కేసు నమోదు



రామకృష్ణాపూర్ అక్టోబర్ 5 (వాయిస్ టుడే)బీ మేకలు మేపడానికి వెళ్లిన వృద్ధుడు తిరుగు రాకుండా పోయాడు. ఈ ఘటన రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని అబ్రహం నగర్ లో నివాసముండే ఎల్పుల ఎల్లయ్య(70) ఈనెల 2 గురువారం రోజున ఉదయం మేకలు మేపడానికి ఇంట్లో నుండి బయటకు వెళ్ళాడు. సాయంత్రం వరకు మేకలు ఇంటికి రాగా ఎల్లయ్య మాత్రం ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. ఈనెల 3న ఎల్లయ్య కుమారుడు ఎల్పుల కుమారస్వామి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.



## ప్రమాదకరంగ మారిన పెక్సీల ఏర్పాటు

### మూలమలుపు వద్ద వాహనాలు కనబడక వాహనదారుల ఇబ్బందులు

### తొలగించేందుకు సాహసం చేయని మున్సిపల్ అధికారులు

రామకృష్ణాపూర్ అక్టోబర్ 5(వాయిస్ టుడే): క్యాతనపల్లి మునిసిపాలిటీ లో అధికార పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తల అత్యుత్సాహం వాహనదారుల ప్రాణాల మీదకు తెస్తుంది. తమ నాయకుల పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకునేందుకు నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని ప్రధాన మార్గం కూడలిలో పోటాపోటీగా ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. క్యాతనపల్లి మీదుగా మంచిర్యాలకు వెళ్లే నేషనల్ హైవే రోడ్డు మూల మలుపు వద్ద రోడ్డు పక్కన అధికార పార్టీకి చెందిన నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీల వల్ల పట్టణ పరిధిలోని వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందిగా మారాయి. నిత్యం నేషనల్ హైవే పై ఇతర ప్రాంతాల నుండి వేలాది వాహనాలు జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో అటువైపుగా వస్తున్న వాహనాలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వలన మూలమలుపు వద్ద వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రయాణికులకు కూర్చోవడానికి వీలుగా స్థానికులు ఏర్పాటుచేసిన సిమెంట్ బెంచీలను ధ్వంసం చేసి మరి ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అధికార పార్టీ నాయకులకు చెందిన ఫ్లెక్సీలు కావడంతో అధికారులు, పోలీసులు అదే రోడ్డు వెంట ప్రయాణం సాగిస్తున్న ఫ్లెక్సీలు తొలగించేందుకు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదనే విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుంది. భారీ ప్రమాదం జరిగి ప్రాణనష్టం జరగకముందే అధికారులు ఫ్లెక్సీలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



## కొల్లూరులో ఘనంగా ఆర్ఎస్ఎస్ దశాబ్ద ఉత్సవాలు

వాయిస్ టుడే మహబూబ్నగర్ జిల్లా, అక్టోబర్ 5 : (జడ్చర్ల) నవాబుపేట్ మండలం పరిధిలో కొల్లూరు గ్రామంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం శాఖ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఆర్ఎస్ఎస్ సంఘం, శతాబ్ది ఉత్సవాలు ఘనంగా, నిర్వహించారు. భారతదేశ దేశం స్వాతంత్ర సమరయోధుల మదిలో సమర్పించుకుంటూ, కోలాటం భాజా భజంత్రీలు గ్రామ వీధుల్లో ఊరేగింపు చేసి ఈ కార్యక్రమానికి మురుగని గంగాపురి, ముఖ్యఅతిథిగా గండేటి చెన్నారెడ్డి, ఆర్ఎస్ఎస్ జిల్లా సభ్యులు , స్వయంసేవకు సంఘం ,, వందమంది పాల్గొనడం .జరిగింది ఈ కార్యక్రమాల్లో చంద్రమోహన్ కంకంటి కృష్ణయ్య రామ్మోహన్ రెడ్డి, రాఘవేందర్, కృష్ణారెడ్డి, లక్ష్మయ్య రైస్ మిల్ రవి , ఆంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆధార్ సేవల సవరించిన ఛార్జీల వివరాలు ప్రతి కేంద్రంలో స్పష్టంగా ప్రదర్శించాలి

### భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే అక్టోబర్ 5: భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యు ఐ డి ఏ ఐ) ఆధార్ సేవలపై సవరించిన కొత్త రుసుములు 2025 అక్టోబర్ 1వ తేదీ నుండి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయని అన్నారు. ప్రజలకు ఈ మార్పులపై పూర్తి అవగాహన కల్పించే విధంగా అన్ని ఆధార్ సేవా కేంద్రాల్లో కొత్త రుసుముల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలనీ జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటన తెలిపారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బయోమెట్రిక్ అప్‌డేట్ (ఫింగర్ప్రింట్, ఐరిస్, ఫోటో) కోసం రేట్లు ఇలా ఉన్నాయి: 5-7 ఏళ్ళ పిల్లలకు ఒకసారి అప్‌డేట్ చేయడం ఫ్రీ, 15-17 ఏళ్ళ పిల్లల కోసం ఒకసారి ఫ్రీ. మిగతా సందర్భాల్లో రూ125 వసూలు అవుతుంది.డెమోగ్రాఫిక్ అప్‌డేట్ అంటే పేరు, లింగం, జన్మతేదీ, చిరునామా, మొబైల్, ఇమెయిల్ వంటి వివరాలను మార్చడం. బయోమెట్రిక్ అప్‌డేట్ తో పాటు చేస్తే ఫ్రీ, వేరుగా చేస్తేల రూ 75 వసూలు. డాక్యుమెంట్ అప్‌డేట్ అంటే ఐడి, చిరునామా డాక్యుమెంట్స్ సమర్పించడం. మై ఆధార్ పోర్టల్ ద్వారా చేస్తే ఫ్రీ, ఎన్రోల్మెంట్ సెంటర్ ద్వారా చేస్తే ల రూ 75 వసూలు.హెూమ్ ఎన్రోల్మెంట్ సర్వీస్ కోసం ఫీజు రూ 700. ఒకే చిరునామాకు బహుళ మంది తీసుకుంటే మొదటి వ్యక్తికి రూ 700, మిగతా వ్యక్తులకి రూ 350 చార్జ్. ఆధార్ డౌన్‌లోడ్ చేసి ముద్రించుకోవడానికి రూ.40 చెల్లించవలసి ఉంటుంది అని అన్నారు. జిల్లా ప్రజలు ఆధార్ సంబంధిత సేవల కోసం కేవలం అధికారిక ఆధార్ సేవా కేంద్రాలు లేదా గుర్తింపు పొందిన సెంటర్లను మాత్రమే వినియోగించాలనీ, ప్రజల్లో ఏ విధమైన అపోహలు లేకుండా సవరించిన రుసుములపై విస్తృత ప్రచారం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ం

## ప్రజావాణి రద్దు

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే అక్టోబర్ 5 : జిల్లాలో జెడ్పీటీసీ ఎంపీపీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో అధికారులు నిమగ్నమై ఉండుటవలన, 06-10-2025 (సోమవారం) న జరగవలసిన ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయబడినది అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ వినతిపత్రాలు, దరఖాస్తులు ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ కార్యాలయం ఇన్వర్డ్ విభాగంలో సమర్పించవలసిందిగా, వాటిని సంబంధిత విభాగాలకు పంపబడతాయని ఆయన సూచించారు.



## మాజీ కేంద్రమంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి వేడుక

### పేదల హృదయాల్లో వెంకటస్వామి

### ఎప్పటికీ చిరస్మరణీయుడు కెడం లింగమూర్తి

వాయిస్ టుడే ప్రతినిధి అక్టోబర్ 6 హుస్నాబాద్ ప్రతినిధి : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో ఈరోజు మాజీ కేంద్రమంత్రి గుడిసెల వెంకటస్వామిగా పేరుగాంచిన గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున పురపాలక సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు పూలమాలవేసి అనంతరం మాట్లాడుతూ.. పురపాలక సంఘ కమిషనర్ టి మల్లికార్జున గౌడ్ మాట్లాడుతూ మాజీ కేంద్రమంత్రి గడ్డం వెంకటస్వామి పేదల హృదయాల్లో ఎప్పుడూ నిలిచి ఉంటాడని పేదవారికి ఇళ్ల స్థలాలు కావాలని కోరడం చేయడంలో ఆయన పోరాట స్ఫూర్తి ఆనాటి కాలంలో చాలామందిని చైతన్యవంతం చేసిందని ప్రజలకు కనీస అవసరాలు అందించడం కోసం ఆయన తన జీవితాన్ని త్యాగం చేశారని ఆయన జీవితాంతం పేదల కోసం బడుగు బలహీన వర్గాల కోసం అట్టడుగు వారికోసం తన జీవితాన్ని అంకితం చేశారని కిందిస్థాయి నుంచి కేంద్ర మంత్రి స్థాయి దాకా ఎదిగిన మహెూన్నత వ్యక్తి వెంకటస్వామి అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కెడం లింగమూర్తి మాజీ ఎంపీపీ ఆకుల వెంకన్న మాజీ కౌన్సిలర్లు గాదపాక రవీందర్ దండి లక్ష్మి కాంగ్రెస్ నాయకులు చిత్తారి రవీందర్ మరియు కాంగ్రెస్ నాయకులు మెప్మా రిసార్స్ పర్సన్స్ వాట్ ఆఫీసర్లు పురపాలక సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పెరుక కుల అల్లాయ్ బలాయి కార్యక్రమం

వరంగల్ ( వాయిస్ టుడే) అక్టోబర్ 05 : స్టేట్ హ్యాండీక్యాఫ్ట్ కార్పొరేషన్ చైర్మన్ పెరుకకుల సాధన కమిటీ చైర్మన్ ముత్తినేని వీరయ్య ఆదేశాల మేర వరంగల్ తూర్పు నియోజకవర్గం పెరిక కులస్తులు ఆదివారం ఘనంగా పెరుక కులస్తుల అలాయ్ బాలయ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో వరంగల్ జిల్లా పెరికకుల జిల్లా ఉపాధ్యక్షులు బెడద వీరన్న ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ తూర్పు కోట నుండి నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర పెరుక కుల పెద్దలు శ్రీరాం భద్రయ్య అల్లం నారాయణ పెరుకకుల రాష్ట్ర అధ్యక్షులు మద్ద లింగన్న గటికే విజయ్ కుమార్ అలాగే వివిధ జిల్లా ల అధ్యక్షులు రాష్ట్ర నాయకులు ఎం సి పి ఐ జిల్లా నాయకులు సుంచు జగదీశ్వర్ సామాజిక పెరకకుల నాయకులు బోల్లుగోడ్డ ప్రభాకర్, వరంగల్ జిల్లా పెరుక కుల సమన్వయ కమిటీ బాధ్యులు ఎసిరెడ్డి ప్రభాకర్ పెరుక కుల కిలా వరంగల్ మండలం ఉపాధ్యక్షులు సుంచ్చ వీరన్న మండల కార్యదర్శి ఎ సి రెడ్డి రఘు స్థానిక పెరుకకుల నాయకులు అరుణ్ జిల్లా కోఆర్డినేటర్ నలివేల సతీష్ (సత్తి ) ఇట్నేని ప్రతాప్ అశోక్ ప్రవీణ్ తుంబరపు రాజు అచ్చ కార్తీక్ వర్మ అచ్చ వేణు కిరణ్ కుమార్ పెద్ద సంఖ్యలో పెరుక కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొని అలయ్ బలాయి కార్యక్రమం విజయవంతం చేశారు.కార్యక్రమం అనంతరం స్టేట్ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరన్నను వరంగల్ జిల్లా పెరుకకుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మరియు జిల్లా నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించుకోవడం జరిగింది.



## ఎమ్మెల్యే దొంతికి మాతృవియోగం

### పరామర్శించిన సీఎం సలహాదారు, మంత్రి, ప్రజాప్రతినిధులు

హనుమకొండ, వాయిస్ టుడే: నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి దొంతి కాంతమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో భాధపడుతుండగా శనివారం హైదరాబాద్ లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో మరణించారు. దొంతి కాంతమ్మ పార్థివదేహాన్ని నియోజకవర్గ ప్రజల, బంధుమిత్రుల సందర్శనార్థం ఆదివారం ఉదయం హనుమకొండ లోని ఎమ్మెల్యే మాధవరెడ్డి నివాసానికి తీసుకురాగా సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, మంత్రి సీతక్క, ఎంపీ లు బలరాం నాయక్, డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, జంగా రాఘవ రెడ్డి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, వదరరాజేశ్వర్ రావు, నమిండ్ల శ్రీనివాస్ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ని పరామర్శించి ఓదార్చారు.

## ప్రజా వాణి కార్యక్రమం రద్దు...

### రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ఎం. హరిత



వాయిస్ టుడే: రాజన్న సిరిసిల్ల జిల్లా: అక్టోబర్ 05: రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం. హరిత ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుండి వినతులను స్వీకరించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం రద్దయిన విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ముగిసేంతవరకు ప్రజావాణి కార్యక్రమము ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు.ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగా కొనసాగిస్తామని వెల్లడించారు.



## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రేస్ పార్టీ అభ్యర్ధుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### రాష్ట్ర ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్

వాయిస్ టుడే: రాజన్న సిరిసిల్ల జిల్లా: అక్టోబర్ 5 : రాజన్న సిరిసిల్ల జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కొనారావుపేట మండల కేంద్రంలో ఆర్యవైశ్య కమ్యూనిటి హాల్ లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించగా రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు..ఈ సందర్భంగా కార్యకర్తలకు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పలు సూచనలను తెలియజేసారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు, జడ్పిటిసిలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాకా సేవలు ప్రశంసనీయం

## పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు

## ఘనంగా వెంకటస్వామి జయంతి



సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా అక్టోబర్-05 వాయిస్ టుడే: తెలంగాణ ముద్దు బిడ్డ మాజీ కేంద్ర మంత్రి, స్వర్గీయ గడ్డం వెంకటస్వామి కాకా తొంభై ఆరవ జయంతిని పురస్కరించుకొని ఆదివారం సుల్తానాబాద్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని కాకా విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెంకటస్వామి అందించిన స్ఫూర్తితో మనందరం పనిచేయాలని, విధులు నిర్వహించే సమయంలో అట్టడుగు వర్గాల వారికి మన ప్రాంతంలోని పేద ప్రజలకు వెంకటస్వామి అనేక సేవలందించారన్నారు. కేంద్ర రాష్ట్ర స్థాయి ప్రభుత్వాలలో కీలకపాత్ర పోషించి, పేదల అభ్యున్నతి కోసం తెలంగాణ రాష్ట్రం కోసం నిరంతరం తపించి పనిచేశారన్నారు. తెలంగాణ సమాజం పడే బాధలను అర్థం చేసుకున్నారని, ప్రజల కష్టాల నివారణకు కృషి చేశారన్నారు. కోల్ బెల్ట్ ఏరియాలో కార్మికుల గుండెల్లో చిరస్థాయి స్థానం పొందిన వ్యక్తి కాకా వెంకటస్వామి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సజ్జాద్, నాయకులు సారయ్య గౌడ్,ముత్యాల రవీందర్, బిరుదు కృష్ణ, గాజుల రాజమల్లు, కల్వల శ్రీనివాస్, అబ్బయ్య గౌడ్, పడాల అజయ్ గౌడ్, అమీరి శెట్టి రాజలింగం, పన్నాల రాములు, మేకల అపోషాలు, టికే ప్రభాకర్, పన్నాల తిరుపతి, గజబింకర్ జగన్, జరిగే శ్రీనివాస్, కల్లేపల్లి జానీ, వినుకొండ శ్రీధర్ పటేల్, పొన్నం చంద్రయ్య గౌడ్, ఉస్తేం గణేష్, , కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు...

## ప్రాంతంపై మమకారం.. ఉచిత వైద్యం



దేవరకొండ: వైద్యరంగం ఖరీదైనదిగా.. వ్యాపారమయంగా మారిందని విమర్శలున్న నేటి రోజుల్లో రోగుల ఆర్థిక పరిస్థితులను బట్టి ఉచితంగా సేవలు అందిస్తున్నారు దేవరకొండ పట్టణానికి చెందిన సీనియర్ వైద్యుడు దేప శ్రీనివాస్‌రెడ్డి. తాను పుట్టిన ప్రాంతంపై మమకారంతో కరోనా నుంచి ఆయన ఈ సేవల్లో నిమగ్నమయ్యారు. ఇక్కడి గిరిజనుల పేదరికం, ఆయనలో మూర్తీభవించిన మానవత్వం వెరసి ఉచిత సేవలకు బీజం పడింది. ఆయనకు ఇద్దరు కుమారులు. ఇద్దరూ అమెరికాలో స్థిరపడ్డారు. ఒకరు డాక్టర్ కాగా.. మరొకరు సాఫ్ట్‌వేర్‌గా 20ఏళ్లుగా అక్కడే ఉన్నారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో వైద్యశాలను ఏర్పాటు చేసి ఉచితంగా సేవలు అందిస్తూ అందరి ప్రశంసలు పొందుతున్నారు.

## అక్కాచెల్లెళ్ల చదువుకి 'అక్షర'సాయం



కల్లూరు : చందంపేట మండలం తెల్దేవరపల్లికి చెందిన లింగంపల్లి గోవింద్, వాణి దంపతులకు కవల పిల్లలు పద్మ, పావనిలు. తల్లిదండ్రులు రోజు కూలి పనులకు వెళ్లే నిరుపేదలు. పద్మ ఎంబీబీఎస్ భద్రాద్రి కొత్తగూడెంలో మెడికల్ కళాశాలలో సీటు సాధించగా.. పావని మహాత్మాగాంధీ యూనివర్శిటీలో ఇంజినీరింగ్ సీటు పొందింది. కానీ వీరిది ఉన్నత చదువులు చదువుకోలేని దీన పరిస్థితి. వీరి కుటుంబ ఆర్థికస్థితిపై ప్రవాసాంధ్రులు డాక్టర్ శిరీషా చిట్టిబోయిన స్పందించి కల్లూరుకి చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ ద్వారా పూర్తి సమాచారం తెలుసుకున్నారు. వైద్య విద్యార్థినికి రూ.1.20 లక్షలు, ఇంజినీరింగ్ విద్యార్థినికి రూ.40వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఆ అక్కాచెల్లెళ్లకి కల్లూరులో స్ఫూర్తి ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీవ్యాల్ ఈ చెక్కులు ఆదివారం అందించారు.

## వావ్.. భలే స్నేహం గురూ..!



మేళ్లచెరువు: స్వామివారి చెంత.. శఠగోపం పెడుతూ దీవెనలు అందిస్తున్న అర్చకుడి పేరు కొంకపాక శివ విష్ణువర్ధన్‌శర్మ. దీవెనలు అందుకుంటున్న వ్యక్తి నాగెళ్ల శంభిరెడ్డి. పక్కనే ఉన్న మరో వ్యక్తి పేరు కూన్‌రెడ్డి కొండారెడ్డి. ఐతే.. ఏంటీ ప్రత్యేకత అనుకుంటున్నారా! ప్రస్తుతం మేళ్లచెరువులోని ఇష్ట కామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో వీరు ముగ్గురూ ఉద్యోగులే. దీవెనలు అందించే వ్యక్తి ఆలయ ప్రధాన అర్చకుడు. అందుకుంటున్నవారు ఆలయ కార్యనిర్వహణ అధికారి. పక్కనే ఉన్న మరొకరు ఆలయ జూనియర్ అసిస్టెంటు. ఇందులో వింతేముంది అంటారా..! ఉంది.. వీరు ముగ్గురూ క్లాస్‌మేట్స్ కావడం, వీరి స్వగ్రామం మేళ్లచెరువు కావడం విశేషమే కదా!

పదో తరగతి వరకు మేళ్లచెరువులోని జడ్పీ ఉన్నత పాఠశాలలోనే విద్యనభ్యసించారు. ఆ తర్వాత.. శంభిరెడ్డి, కొండారెడ్డిలకు 1993లోనే దేవాదాయ ధర్మాదాయ శాఖలో జూనియరు అసిస్టెంట్లుగా ఉద్యోగం లభించింది. విష్ణుకూ 2000లో ఇదే ఉద్యోగం వచ్చింది. అప్పట్నుంచి వేర్వేరు ప్రాంతాల్లో వీరు విధులు నిర్వహించారు. గత కొన్నేళ్లుగా అర్చక వృత్తినీ చేస్తున్న విష్ణువర్ధన్‌కు జూనియరు అసిస్టెంటు నుంచి అర్చకుడిగా ఇక్కడి శివాలయంలో ఉద్యోగ అవకాశం లభించింది. పద్నాలుగేళ్లుగా ఇక్కడే ఆలయ ప్రధాన అర్చకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. కొండారెడ్డీ దాదాపు తొమ్మిదేళ్ల నుంచి ఇక్కడే విధుల్లో ఉన్నారు. తాజాగా.. రెండు నెలల కిందట జూనియరు అసిస్టెంటు నుంచి ఉద్యోగోన్నతి పొందిన శంభిరెడ్డి ఈ ఆలయ కార్యనిర్వహణ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.

ఒకే ఊరు, ఒకటే తరగతి స్నేహితులుగా ఉన్న వీరు ఇప్పుడు ఒకే శాఖ ఉద్యోగులుగా.. ఒకే ఆలయంలో విధులు చేపట్టడం విశేషం. సొంత ఊళ్లో ఇష్టదైవం శివయ్యకు సేవలందించే భాగ్యం కలగడం తమ అదృష్టమని ఈ ముగ్గురూ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. వీరి గురించి తెలిసిన భక్తజనం ఓహో.. భలే స్నేహం గురూ..! అంటూ చమత్కరిస్తూ అభినందనలు చెబుతున్నారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే అక్టోబర్ 5 : పాల్వంచ మండలం పాత పాల్వంచలో జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాల బ్యాచ్ 1997బి98, ఈరోజు పూర్వ విద్యార్థుల ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వందమంది పూర్వ విద్యార్థులు 10 మంది ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవడం జరిగింది. ముఖ్య అతిథులుగా మోహన్ రెడ్డి సారు, లక్ష్మయ్య సారు, రమా మేడం, వెంకటలక్ష్మి మేడం, శ్రీను సారు, నాగమణి మేడం, గోవిందరాజు సారు ఈ కార్యక్రమంలో పాలు పంచుకోవడం జరిగింది.






## సత్యనారాయణ జాతీయ ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఎంపిక

సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా అక్టోబర్-05వాయిస్ టుడే: జాతీయ ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా బొల్లి సత్యనారాయణ అవార్డు అందుకున్నారు.ఆదివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వాగేశ్వరి డిగ్రీ,పీజీ కళాశాలలో నిర్వహించిన గురుస్ స్టూడెం ట్స్, పేరెంట్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడాకారులను తయారు చేస్తూ విశిష్ట సేవలు అందించిన సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బొల్లి సత్యనారాయణను గురుస్ స్టూడెంట్స్, పేరెంట్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఇండియా చైర్మన్,జాతీయ అధ్యక్షుడు గంగారపు మల్లేశం తో పాటు సంస్థ ప్రతినిధులు, ఉత్తమ ఉపాధ్యాయుడుగా ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందించి ఘనంగా శాలువాతో సత్కరించారు.ఈసందర్భంగా గురుస్ సంస్థ ప్రతినిధులకు బొల్లి సత్యనారాయణ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు..

## గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

### 160 గ్రాముల గంజాయి స్వాధీనం



వాయిస్ టుడే: రాజన్న సిరిసిల్ల జిల్లా:అక్టోబర్ 5 : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులో గంజాయి విక్రయించేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను ఎల్లారెడ్డిపేట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 160 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ?ఎస్.ఐ. రాహుల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో అందిన సమాచారం మేరకు, పోలీసులు ఎల్లమ్మ కమాన్ వద్దకు వెళ్లారు. అక్కడ అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. ?విచారణలో వారిని ఎల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన కారం శ్యామ్ కుమార్ (తండ్రి లక్ష్మీ నరసయ్య), రేసు అక్షయ్ (తండ్రి హరీష్) గా గుర్తించారు. వీరు హైదరాబాదులో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి, ఎల్లారెడ్డిపేటలో ఎక్కువ ధరకు అమ్మేందుకు వచ్చినట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి, వారిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాహుల్ రెడ్డి పేర్కొన్నారు.



## కోనరావుపేట ఎస్సై ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

వాయిస్ టుడే:రాజన్న సిరిసిల్ల జిల్లాబీఅక్టోబర్ 5 : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కోనరావుపేట మండల పరిధిలో సబ్ ఇన్‌స్పెక్టర్ కే. ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో విస్తృతంగా డ్రంక్ %డ% డ్రైవ్ వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనం నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అలాగే మైనర్ పిల్లల చేత వాహనాలు నడపనీయకూడదని, అలా చేస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, డ్రైవింగ్ లైసెన్స్, వెహికల్ ఇన్సూరెన్స్ వంటి అవసరమైన డాక్యుమెంట్లు కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా మాత్రమే ప్రమాదాలను నివారించగలమని పేర్కొంటూ ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

## కూలీ పనికి వెళ్లి మృత్యువాత

ములుగు: కూలీ పనికి వెళ్లి ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి మృత్యువాత పడిన ఘటన ములుగు జిల్లా కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. వెంకటాపూర్ మండల కేంద్రానికి చెందిన సిరిపెల్లి రాజయ్య(48) వ్యవసాయ కూలీ పనులు చేస్తుంటారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు లేకపోవడంతో జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు చేయడానికి వచ్చారు. కార్మికులతో కలిసి ఇనుప పైపును భుజంపై పెట్టుకొని నడుస్తుండగా రాజయ్య కిందపడిపోయాడు. దీంతో ఇనుప పైపు తలపై పడటంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు.. బంధువుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పిడుగుపడి మహిళ దుర్మరణం

కాటారం, న్యూస్‌టుడే: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ఒడిపిలవంచ గ్రామంలో పిడుగు పడి ఓ మహిళ మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఇసునం లక్ష్మి (46) కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. ఆదివారం ఉదయం ఎప్పటిలాగే గ్రామ శివారులోని పత్తి చేనులో పనులకు వెళ్లారు. మధ్యాహ్నం వర్షం పడి ఒక్కసారిగా ఆమెపై పిడుగుపడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని మహదేవపూర్ ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. లక్ష్మి భర్త రాజయ్య సైతం నాలుగేళ్ల కిందట పశువులను మేపేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందారు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.